ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



హిమాయత్‌సాగర్‌లో సర్వే తీరును పరిశీలిస్తున్న కమిషనర్

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్‌లోని హిమాయత్‌సాగర్‌లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే రీ వెరిఫికేషన్‌ను ఆయన పరిశీంచారు. దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి స్వయంగా సర్వే చేశారు. ఆర్‌ఐ కె.శివకుమార్, వార్డు ఆఫీసర్ శ్రీశైలం, బిల్ కలెక్టర్ మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారిలో బోరు.. అడ్డుకున్న అధికారులు

శంషాబాద్: మధురానగర్ కాలనీ రహదారిపై ఓ వ్యక్తి బోరు వేశాడు. అలా వేయకూడదంటూ అడ్డుచెప్పినా వినకుండా సుమారు 2 వేల ఫీట్ల లోతు వరకు బోరును తవ్వించాడు. దీంతో కాలనీవాసులు రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్‌ఐ కృష్ణ, మున్సిప్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది బాబురావు అక్కడికి చేరుకుని బోరు లారీని అక్కడి నుంచి పంపించేశారు. బోరును మూసివేయించారు. రహదారులపై బోర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

కొత్త భవనంలోకి కోర్టుల తరలింపు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లి మెట్రోపాలిటన్ కోర్టు సముదాయాన్ని నూతన భవనంలోకి మార్చారని ఉప్పర్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 30వ తేదీ (సోమవారం) నుంచి కొత్త కోర్టులో కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. కక్షిదారులు ఈ విషయాన్ని గ్రహించాలని సూచించారు.

బాలుడి అదృశ్యం



రామ్‌చరణ్

శంషాబాద్ రూరల్: ఫాస్ట్ ఫుడ్ కేంద్రానికి వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... తల్లిదండ్రులు చనిపోవడంతో ఎం.రామ్‌చరణ్(15) మదన్‌పల్లిలో తన మేనమామ శేఖర్ వద్ద ఉంటున్నాడు. ఈ నెల 26న రాత్రి పక్కింటి నివాసి కె.చంద్రకళ తన కోసం ఫ్రైడ్‌రైస్ తీసుకురమ్మని రాంచరణ్‌కు రూ.100 ఇచ్చి ఫాస్ట్‌ఫుడ్ కేంద్రానికి పంపింది. తర్వాత బాలుడు ఇంటికి తిరిగి రాలేదు. అన్ని చోట్ల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్తంభాన్ని ఢీ కొన్న బైక్: బాలుడి మృతి



మృతి చెందిన సాత్విక్

మణికొండ: ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఓ బాలుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... కిస్మత్‌పూర్‌కు చెందిన గోపాల సాత్విక్(17) తన స్నేహితుడు నిషాల్‌తో కలిసి యమహా ఎఫ్ జెడ్ (టీఎస్ 08 హెచ్‌ఆర్ 4820) ద్విచక్రవాహనంపై ఔటర్ రింగ్ రోడ్డు కోకాపేట సర్కిల్ నుంచి టీ గ్రిల్‌వైపు అతివేగంగా వెళ్తున్నాడు. ఫిషర్‌మెన్ హోటల్ వద్ద వారి బైక్ అదుపు తప్పి డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. దాంతో సాత్విక్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న అతని స్నేహితుడు నిషాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో నిషాల్‌ను పక్కనే ఉన్న ఆస్పత్రికి తరలించారు. మితిమీరిన వేగంతో వాహనాన్ని నడపటంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు వారు వివరించారు.

ముమ్మరంగా టూంబ్స్ చౌరస్తా సుందరీకరణ పనులు

గోల్కొండ: సెవన్ టూంబ్స్ చౌరస్తా సుందరీకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొంత కాలంగా వాహనాల రాకపోకలతో ఈ చౌరస్తా రద్దీగా మారింది. పర్యాటక ప్రాంతాలైన కుతుబ్ షాహీ సమాధుల ప్రాంగణం, గోల్కొండ కోటకు వెళ్లే రోడ్డు తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఈ చౌరస్తా గుండానే రాకపోకలు సాగిస్తాయి. ట్రాఫిక్ తీవ్రతను తగ్గించడానికి ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడానికి చౌరస్తా వద్ద మోడ్రన్ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు పనులు కూడా జరుగుతున్నాయి. దీనికి తోడు హెరిటేజ్ మాడ్రన్ స్ట్రీట్ లైట్స్ కూడా ఏర్పాటు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో 'సేఫ్ జర్నీ'

- వాహనదారులతోపాటు పాదచారులూ అవగాహనతో మెలగాలి
- రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ
- ఆరాంఘర్ చౌరస్తాలో వాహనదారులకు అవగాహన

ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి



ఆరాంఘర్ చౌరస్తాలో ప్ల కార్డులను ప్రదర్శిస్తూ ట్రాఫిక్ పోలీసులతో కలిసి అవగాహన కల్పిస్తున్న సొసైటీ సభ్యులు

రాజేంద్రనగర్: సురక్షితమైన ప్రయాణానికి వాహనదారులతోపాటు పాదచారులు సైతం తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ సూచించారు. శనివారం సాయంత్రం ఆరాంఘర్ చౌరస్తా వద్ద సొసైటీ ఫర్ సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆర్గనైజేషన్ సభ్యులతో కలిసి ఆయన వాహనదారులకు అవగాహన కల్పించారు. సొసైటీ సభ్యులతో పాటు ట్రాఫిక్ పోలీసులు వాహనదారుల వద్దకు వెళ్లి ట్రాఫిక్ నిబంధనల ఆవశ్యకతను వివరించారు.

- సొసైటీ సభ్యులు చౌరస్తాలోని నాలుగు దిక్కుల్లో ప్ల కార్డులను పట్టుకొని ప్రదర్శించారు.
- ఈ సందర్భంగా ఏసీపీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ రాజేందర్ గౌడ్‌లు మాట్లాడుతూ... వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరి కన్నా ఎక్కువగా ప్రయాణించవద్దన్నారు.
- జీబ్రా క్రాసింగ్‌ల వద్ద మాత్రమే పాదచారులు రోడ్డు దాటాలని సూచించారు. చాలా ప్రమాదాలు రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనాల వల్లే జరుగుతున్నాయన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలను నడపవద్దని సూచించారు.
- మద్యం సేవించి వాహనాలను నడపరాదని ఈ సందర్భంగా ఏసీపీ స్పష్టం చేశారు. డిసెంబర్ 31, జనవరి 1వ తేదీల నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్ చేపడతామని వెల్లడించారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు డ్రైవ్ కొనసాగుతుందన్నారు.
- మద్యం మత్తులో వాహనాలు నడిపినా.. వాహనాలపై విన్యాసాలు చేసినా... అర్ధరాత్రి బైక్ రేసింగ్ చేసినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.
- సొసైటీ సభ్యులు వాహనదారుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించడం ఆకట్టుకుంది. హెల్మెట్ ధరించినప్పటికీ... హెల్మెట్ బెల్టు పెట్టుకోకపోవడం ప్రమాదమంటూ అవగాహన కల్పించారు.
- కారులో సీటు బెల్టు పెట్టుకోకపోవడాన్ని గమనించి వారికి అవగాహన కల్పించారు.
- కార్యక్రమంలో ఆర్‌ఐ గణేష్, ఎస్‌ఐ రాంప్రసాద్, సొసైటీ సభ్యులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.





ఏఐ రంగంలో రాణించాలి

డీఎల్‌ఆర్‌ఎల్ శాస్త్రవేత్త డాక్టర్ ఏకే సింగ్



మాట్లాడుతున్న ఏకే సింగ్

మణికొండ: రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అన్ని రంగాలలో విస్తరిస్తుందని, అందులో ఇంజినీరింగ్ విద్యార్థులు అవగాహన పెంచుకుని, తమ ఇన్నోవేషన్‌లలో దాన్ని చేర్చుకుని రాణించాలని డీఎల్‌ఆర్‌ఎల్ శాస్త్రవేత్త, ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఏకే సింగ్ అన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలు సంయుక్తంగా నిర్వహించిన ఏరోస్పేస్, రక్షణ రంగాలలో సాంకేతిక పురోగతిలో కృత్రిమ మేధస్సు పాత్ర అనే అంశంపై రెండవ రోజు గండిపేటలోని ఎంజీఐటీ కళాశాలలో సెమినార్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కృత్రిమ మేధస్సు రంగంలో రాబోయే రోజుల్లో అనేక ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. దాన్ని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు సంసిద్ధులు కావాలన్నారు. ఎంజీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, ఐఈఐ రాష్ట్ర చైర్మన్ వెంకట సుబ్బయ్యతో కలిసి విజేతలకు ధ్రువపత్రాలు, మెమెంటోలను అందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, కన్వీనర్‌లు డాక్టర్ ఎస్‌పీ సింగ్, డాక్టర్ బ్రహ్మరెడ్డి, ఉస్మానియా ప్రొఫెసర్‌లు డాక్టర్ నిర్మలాదేవి, డాక్టర్ ప్రవీణ, బాలరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రజల మద్దతుతో ముందుకు సాగుతున్నాం'



ఎమ్మెల్యే కౌసర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ ప్రజల మద్దతు, ప్రేమాభిమానాలతోనే రాజకీయాల్లో ముందుకు సాగుతున్నానని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన నానల్‌నగర్, కార్వాన్ తదితర డివిజన్‌లలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల వారిని కలుసుకొని వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజల మద్దతుతోనే మూడవ సారి ఎమ్మెల్యేగా విజయం సాధించానన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే కాకుండా నియోజకవర్గ అభివృద్ధికి తాను చు పుతున్న చొరవ వల్ల అన్ని వర్గాల ప్రజలు తనను ఆదరిస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు.

మార్కెట్ కమిటీని ప్రకటించండి



వేంనరేందర్‌రెడ్డిని కలిసిన నాయకులు

మణికొండ: సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్న గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ పాలక కమిటీని ప్రకటించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్ రెడ్డిని కోరారు. శనివారం నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న వేణుగౌడ్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆయనను కలిసి తనకు పదవి వచ్చేలా కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదే సందర్భంలో ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీపై చర్చించుకున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల పట్ల ఎలాంటి పోటీ లేదని, కేవలం కొంత మంది డైరెక్టర్‌ల పదవుల విషయంలోనే పోటీ ఉందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రాబోయే రోజుల్లో ఏర్పడే కమిటీలో వారికి అవకాశం ఇద్దామని, అంత వరకు ప్రస్తుత కమిటీని ప్రకటించాలని కోరారు. స్పందించిన ఆయన త్వరలోనే కమిటీని ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీపీ తలారి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫుడ్ డే

గోల్కొండ: టోలిచౌకీ డిలక్స్ కాలనీలోని వీనస్ హై స్కూల్‌లో శనివారం ఫుడ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ విద్యార్థులు ఆడిపాడుతూ సందడి చేశారు. ఇంటి నుంచి ఫ్రూట్స్, స్నాక్స్ తెచ్చుకుని తమతోటి పిల్లలతో సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం అమ్మాయిలు ర్యాంప్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ మాట్లాడుతూ.. కలిసిమెలిసి ఉండడం ఒకే చోటు కూర్చొని తినడం వల్ల కలిగే ప్రయోజనాలను పీపీ చిన్నారులకు నేర్పించడం జరుగుతుందన్నారు. సహపంక్తి భోజనాల వల్ల చిన్నారుల మధ్య ప్రేమాభిమానాలు వెల్లడవుతాయని ఆయన అన్నారు. పీపీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రజనీకాంత్



రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బహిరంగ ప్రదేశాలు, ఓపెన్ పాయింట్లు, ఖాళీ స్థలాలు, రోడ్డుకు ఇరువైపులా ప్రజలు చెత్తాచెదారం ఇతర వ్యర్థాలను వేయవద్దని సర్కిల్ ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రజనీకాంత్ ప్రజలను కోరారు. శనివారం సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రోజూ తమ కార్మికులు ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీలను శుభ్ర పరుస్తున్నారన్నారు. చెత్తను ప్రతి ఇళ్ల నుంచి సేకరించేందుకు ఆటో, రిక్షాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఇంటి నుంచి నూటికి నూరు శాతం చెత్తను అపార్ట్‌మెంట్‌లు, కాలనీలు, బస్తీలవారీగా సేకరిస్తున్నట్లు తెలిపారు. కానీ కొందరు ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణదారునికి చెత్తను అందించకుండా ఖాళీ ప్రదేశాలు, రోడ్డుకు ఇరువైపులా వెదజల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా రోడ్లు అపరిశుభ్రంగా మారుతున్నాయన్నారు. ఓపెన్ పాయింట్లలో తమ సిబ్బందిని వాచ్‌మెన్‌లుగా నియమించి కొంత మేర అరికట్టామన్నారు. దీంతో ఖాళీ ప్రదేశాల్లో చెత్తను వేస్తున్నారన్నారు. వారిని గుర్తించి అపరాధ రుసుం విధిస్తామన్నారు. చెత్త సేకరణకు కొత్తగా 50 రిక్షాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మొత్తం 80 రిక్షాలలో చెత్తను ఎప్పటికప్పుడు సేకరిస్తున్నామన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా తెలిపారు.

చిన్నప్పటి నుంచే విద్యపై ఆసక్తిని కల్పించాలి

రాజేంద్రనగర్ ఎంఈవో శంకర్ రాథోడ్



మాట్లాడుతున్న ఎంఈవో శంకర్‌రాథోడ్

అత్తాపూర్: చిన్నారులను ఆట, పాటలతో కూడిన ప్రదర్శనల పట్ల ఆకర్షితులను చేస్తూ వారిలో చదువుపై ఆసక్తి కల్పించేలా ప్రోత్సహించాలని రాజేంద్రనగర్ మండల విద్యాశాఖ అధికారి కె.శంకర్‌రాథోడ్ సూచించారు. శనివారం రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో అత్తాపూర్ రాంబాగ్ సమీపంలోని హైదరాబాద్ స్కాట్స్ హై స్కూల్ ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి క్రీడోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ... నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులకు పోటీలు నిర్వహించడం వారిలో ఎంతో ఉత్సాహాన్నిస్తుందన్నారు. సంఘం అధ్యక్షుడు ఎం.ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శి జి.శరవణ్‌కుమార్, కోశాధికారి ఎస్.ఆర్.రజనీకాంత్, క్రీడా, సంస్కృతిక కార్యదర్శులు వేణుగోపాల్, బోయ లక్ష్మణ్, డాక్టర్ సంజీవ, యాదగిరి, రాంబాబు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు

విద్యార్థికి అభినందన

మణికొండ: సీఎం కప్ క్రీడా పోటీలలో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి హరినాథ్‌రెడ్డిని స్థానిక కౌన్సిలర్ సన్మానించి అభినందించారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి హరినాథ్‌రెడ్డి పరుగు పోటీలలో 600 మీటర్లు, వంద మీటర్ల విభాగంతో లాంగ్ జంప్‌లో రాణించి మొదటి బహుమతులను సాధించాడు. ఈ నెల 30వ తేదీన రాష్ట్ర స్థాయి పోటీలలో అతను పాల్గొననున్నాడు. దాంతో శనివారం మణికొండ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి పాఠశాలలో అతన్ని సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ... చదువులతో పాటు క్రీడలలోను రాణించాలన్నారు. హరినాథ్‌రెడ్డి క్రీడా పోటీలకు అవసరమైన సామగ్రితో పాటు సహాయం అందిస్తామన్నారు. క్రీడలతో ఉద్యోగాలతో పాటు మంచి పేరు ప్రతిష్ఠలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయుడు నిరంజన్, నాయకులు బి.శ్రీరాములు, కుమార్, శ్రవణ్‌కుమార్, గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందించిన కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి

పీజేఆర్‌కు ఘన నివాళి

గోల్కొండ: దివంగత మాజీ సీఎల్పీ నేత పీజేఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గుడిమల్కాపూర్ చౌరస్తాలో కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ ఠాకూర్ అమర్‌సింగ్, గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు జె.రవీందర్, పరశురామ్‌తో పాటు పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజల అభ్యున్నతికి, సమాజ సంక్షేమానికి పీజేఆర్ చేసిన కృషిని వారు కొనియడారు.

న్యూ ఇయర్ వేడుకలకు అనుమతి తప్పనిసరి

అత్తాపూర్: డిసెంబర్ 31న నిర్వహించే కొత్త సంవత్సర ఆహ్వాన వేడుకల్లో లిక్కర్ ఈవెంట్స్ నిర్వహించాలనుకునే వారు ఎక్సైజ్ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని శంషాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గంద్ర దేవేందర్‌రావు పేర్కొన్నారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ... తమ స్టేషన్ పరిధిలో 2024వ సంవత్సరంలో ఇప్పటి వరకు వివిధ నేరాలకు పాల్పడిన వారిపై 171 కేసులు నమోదు చేశామన్నారు. వీటిలో సుంకం చెల్లించని మద్యం (ఎన్‌డీపీఎల్) 21 కేసులు, గంజాయి, నార్కొటిక్(ఎన్‌డీపీఎస్) డ్రగ్ కేసులు 37 ముఖ్యమైన కేసులుగా నమోదు చేశామన్నారు. వీటిలో 114 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎన్‌డీపీఎల్, ఎన్‌డీపీఎస్ వంటి వాటిల్లో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్, సుంకం చెల్లించని మద్యాన్ని వాడితే కఠిన చర్యలు తీసుకోవడం తథ్యమని ఆయన హెచ్చరించారు. శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వారు డిసెంబర్ 31న ఈవెంట్స్ చేసుకునే ఫంక్షన్ హాల్స్, కన్వెన్షన్స్, ఫామ్ హౌస్‌లు, రిసార్ట్స్, కమ్యూనిటీలలో నిర్వహించే వేడుకలకు ఎక్సైజ్ శాఖ నుంచి లిక్కర్ ఈవెంట్ పర్మిట్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

వేడుకగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



పడి పూజలో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూజల్లో బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. పూజల్లో నర్సిరెడ్డి గురుస్వామి, వెంకటేష్ గురుస్వామి, రమేష్ గురుస్వామి, కొండల్ గురుస్వామి, రవికుమార్ గురుస్వామి, సేవా సమితి సన్నిధానం స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీకే ప్రజాదరణ



బీజేపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న జిల్లా కార్యదర్శి కొమురయ్య, విజయ్‌కుమార్

అత్తాపూర్: భారతీయ జనతా పార్టీకి ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతున్నదన్న ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మోండ్ర కొమురయ్య, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్ పేర్కొన్నారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని బూత్ నెంబర్ 197లో జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు కాకులారం కృష్ణ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ... యువకులు, ప్రజలు, మహిళలు ఎంతో ఉత్సాహంగా బీజేపీ సభ్యత్వం తీసుకునేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఈ నెల చివరి వరకు అందరూ బూత్ కమిటీలు పూర్తి చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేస్తామని వారు ధీమా వక్తం చేశారు. పార్టీ నేతలు కొండమీది లింగం, కమలేకర్ రాజు, కాకులారం లావణ్య, సింగాపురం శ్రీలత, రావుల సుశీల, కాకులారం కమలమ్మ, అక్కాలదేవి భవానీ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ కిట్‌ల పంపిణీ



మెటీరియల్‌ను అందజేస్తున్న పేరెంట్స్ కమిటీ సభ్యులు

మణికొండ: సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో దోమల సమస్యను నివారించేందుకు పేరెంట్స్ కమిటీ ముందుకొచ్చి కిట్‌లను అందించింది. నార్సింగి మున్సిపల్ కేంద్రంలో ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో ఇటీవల దోమల సమస్య పెరిగిపోయింది. ఎన్ని విధాల ప్రయత్నం చేసినా అవి తగ్గకపోవటం, విద్యార్థినులు వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో స్పందించిన పేరెంట్స్ కమిటీ కిటికీలకు దోమ తెరల ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందుకు అవసరమైన సామగ్రిని శనివారం పాఠశాలలో అందించారు. వైస్ ప్రిన్సిపాల్ రజిత, ఉపాధ్యాయులు శారద, స్వప్న, పేరెంట్ కమిటీ సభ్యులు ప్రభాకర్, రవి, నరేందర్, నరసింహులు, కృష్ణ, కె. నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడి కట్టు.. శబరిమలక్కు..

అత్తాపూర్: అయ్యప్ప స్వామి నామస్మరలణతో ఆ ప్రాంతం మారుమోగింది. అయ్యప్ప మాల ధరించిన స్వాములు శనివారం అత్తాపూర్‌లోని ఆలయంలో ఇరుముడి కట్టుకొని శబరిమలై అయ్యప్ప స్వామి దర్శనానికి బయలుదేరారు. ఈ పూజల్లో స్థానిక నాయకుడు వనం శ్రీరామ్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములను ఘనంగా సన్మానించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. పూజల్లో భరత్, శ్రీనివాసాగౌడ్, శంకర్, నాగేష్ గురుస్వామి వెంకటేష్ గురుస్వామి, కొండారెడ్డి గురుస్వామి, భక్తులు పాల్గొన్నారు.



శబరిమలైకు వెళ్తున్న అయ్యప్ప స్వాములు

ఎంజీఐటీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కళాశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో శనివారం సాయంత్రం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. దేశ, విదేశాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు వచ్చి తమ కళాశాల నాటి రోజులను స్మరించుకున్నారు. తమకు పాఠాలు బోధించిన అధ్యాపకులను కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కళాశాలలో సాధించిన ప్రగతిని తెలుసుకున్నారు. కళాశాల అభివృద్ధికి తమ విలువైన సూచనలు, సలహాలను అందించారు. రాబోయే రోజుల్లో కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, కన్వీనర్ డాక్టర్ ఆర్.వి.ఎస్.ఎం.రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

రాయదుర్గం: భారతదేశంలో బహుళ అవకాశాలు ఉంటాయని, వాటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ జేపీ చౌదరి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని సెయింట్ జేవియర్స్ పీజీ కళాశాలలో శనివారం 'గ్రాడ్యుయేషన్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. బీబీటీసీఎస్ వ్యవస్థాపకుడు సీఈఓ డాక్టర్ శ్రీనివాస్ భూసారపు మాట్లాడుతూ... యువత వినూత్న ఆలోచనలు కలిగి ఉండాలన్నారు. దేశాన్ని డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా మార్చడంపై కూడా దృష్టి సారించడంపై తమదైన శైలిలో ప్రయత్నించాలన్నారు. అతిథులు డాక్టర్ జేపీ చౌదరి, డాక్టర్ శ్రీనివాస్ భూసారపు, ఉపాధ్యక్షుడు పి అశోక్‌గౌడ్ చేతుల మీదుగా 2022–24వ బ్యాచ్ ఎంబీఏ విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.